నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 23 జూన్ 2025 | NIZAMABAD

రైతన్నలకు మళ్లీ పదేండ్ల క్రితం నాటి రోజులు వచ్చాయి. ఎరువుల కోసం పడిన కష్టాలు పునరావృతమవుతున్నాయి. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలను సాగుచేసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం సకాలంలో ఎరువులు, పెట్టుబడి సాయం, 24 గంటలు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు 'సాగు' భారంగా మారింది. గతేడాది వానకాలంలో మాదిరిగానే మళ్లీ ఈసారి కూడా ఎరువుల కష్టాలు తప్పడంలేదు. నిజామాబాద్ జిల్లాలో యూరియా కొరత వేధిస్తున్నది. సహకార సంఘాలకు అరకొరగా యూరియా సరఫరా చేయడంతో రైతులందరికీ అందడంలేదు. దీంతో ఎక్కడ చూసినా యూరియా కోసం రైతులు బారులు తీరుతున్న దృశ్యాలు కనిపిస్తుండడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాకు అరకొరగా సరఫరా

–బోధన్, జూన్ 22



యూరియా కొరత తీరేదెన్నడు!

- నాట్లు పూర్తయినా అందుబాటులో లేని ఎరువులు
- సహకార సంఘాల్లో నిండుకుంటున్న నిల్వలు
- రైతులకు తప్పని తిప్పలు.. ఉదయం నుంచే బారులు
- సొసైటీల చుట్టూ తిరుగుతున్నామంటూ వాపోతున్న అన్నదాతలు
- ఎరువులతో పాటు అవసరంలేని మందులను కట్టబెడుతున్న కంపెనీలు

నిజామాబాద్ జిల్లాలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. మరోపక్క జిల్లాలోని బోధన్, వర్ని, కోటగిరి, చందూర్, మోస్రా, రుద్రూర్ తదితర మండలాల్లో నాట్లు పూర్తయి 20 రోజులవుతున్నది. వరి నాట్లు వేసిన తర్వాత యూరియా అవసరం ఎంతో ఉంటుంది. సరైన సమయంలో యూరియా ఎరువు వేయకపోతే పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది. సరిగ్గా రైతులకు అవసరం ఉన్న ఈ కాలంలో యూరియా ఎరువు కొరత వేధిస్తున్నది. కొన్ని సింగిల్ విండోలు, ప్రైవేట్ డీలర్ల వద్ద సరిపడా యూరియా లేకపోవడంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పాలకులకు, అధికార యంత్రాంగానికి ముందుచూపు కొరవడడం, అవసరాలకు తగ్గట్టుగా ఎరువులను తెప్పించుకోకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. గతేడాది కూడా ఇదే విధంగా జిల్లాలోని కొన్ని చోట్ల యూరియా కొరత ఏర్పడింది. కనీసం గతేడాది అనుభవాల నుంచైనా పాలకులు గుణపాఠం నేర్చుకోకపోవడం శోచనీయం. ఈ వానకాలంలో ఉమ్మడి జిల్లాలో 7.48 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగుచేస్తున్నారు. దీంతో ఎరువుల అవసరం గణనీయంగా పెరిగింది. ఇందుకు తగ్గట్టుగా ఉమ్మడి జిల్లాలో ఎరువుల స్టాక్ లేదు. ఈ సీజన్‌కు 75 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రారంభ నిల్వలు 33, 609 మెట్రిక్ టన్నుల మేరకు ఉంది. ప్రస్తుతం 17,269 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఎరువుల నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, ఆ మేరకు నిల్వలు లేవని తెలిసింది.

సదాశివనగర్ మండలం పద్మాజీవాడిలో యూరియా కోసం చెప్పులను క్యూలో పెట్టి వేచి చూస్తున్న రైతులు (ఫైల్)

ఎరువుల స్టాక్ అయిపోవడంతో మూసి ఉన్న బోధన్ సొసైటీ ఎరువుల గోదాం

స్టాక్ లేకున్నా ఉన్నట్లు చూపిస్తూ..

ఎరువుల డీలర్లు ఎప్పటికప్పుడు పీఓఎస్ యంత్రాల్లో అమ్మిన ఎరువుల వివరాల నమోదుచేయకపోవడంతో ఎరువుల నిల్వలు లేనప్పటికీ, ఉన్నట్లుగా చూపిస్తున్నదని పలువురు అంటున్నారు. సొసైటీల్లో వచ్చిన ఎరువులు ఎప్పటికప్పుడు నిండుకుంటున్నాయి. ఉదయం ఎరువుల స్టాక్ రాగానే, రైతులు ఎగబడుతున్నారు. సగం మంది రైతులకు ఎరువులు ఇవ్వగానే స్టాక్ అయిపోతున్నది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండగా.. సొసైటీల చుట్టూ తిరగాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొన్ని సొసైటీల్లో ఎరువులతో పాటు వారికి అంతగా అవసరంలేని కొన్ని మందులను అంటగడుతున్నారని, వాటిని కొంటేనే ఎరువులు ఇస్తామని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో కొన్నిచోట్ల డీలర్లపై రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు.

యూరియా కోసం తిరుగుతున్నాం..

యూరియా కోసం వారం రోజులుగా తిరుగుతున్నా. ఇప్పటివరకు యూరియా దొరకలేదు. రెండు, మూడు రోజులకోసారి యూరియాను సొసైటీకి పంపతున్నారు. వచ్చింది వచ్చినట్లు అయిపోతున్నది.. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఒకేసారి ఎరువులు తీసుకుని నిల్వ చేసుకుంటాం. అయితే, ఇప్పుడు సీజన్‌కు సంబంధించిన ఎరువు ఒకేసారి తీసుకునే పరిస్థితి లేదు. కనీసం ఇప్పుడు వేసే యూరియాకు కూడా తిరగక తప్పడంలేదు.

- బంతి మోతీలాల్, రాజీవ్‌నగర్ తండా

ఎరువులు అందుబాటులో ఉంచాలి

పోతంగల్, జూన్ 22: అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలి. ఎరువుల కోసం సొసైటీ గోదాంకి వెళ్లిన ప్రతిసారి స్టాక్ అయి పోయిం దని అంటున్నారు. నాకు ఎనిమిదెకరాల భూమి ఉంది. దీంతోపాటు మరికొంత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. ఎరువుల కోసం వెళ్లిన ప్రతిసారి ఎరువులు లేవు.. ఉదయం లోడ్ వస్తుందని చెబుతున్నరు. ఉదయం వెళ్లేసరికి యూరియా కోసం బారులు తీరుతున్నారు. గతంలో ఇలాంటి సమస్య ఎన్నడూ ఎదురుకాలేదు.

- ఎస్.సాయిలు, రైతు, పాతంగల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్

- రైతు మోసకారి.. రేవంత్‌రెడ్డి సర్కార్
- రైతు భరోసా కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే
- ఇన్వెస్టింగ్ అధికారిగా మాట్లాడుతున్న పీసీసీ చీఫ్
- జిల్లాకు మంత్రి పదవి రాకపోవడం అన్యాయం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కంఠేశ్వర్, జూన్ 22: పథకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం ఏడాది కాలం నుంచి ఓట్ల సమయంలోనే రైతులకు నామమాత్రంగా పథకాలు అమలు చేస్తూ ఓట్లు లేని సమయంలో పథకాలు ఎగ్గొడుతూ రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. రైతులకు నేరుగా నగదు బదిలీ పథకం ఎక్కడ లేకున్నా కేసీఆర్ మొట్టమొదటిసారిగా రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు పథకం ప్రారంభించారని తెలిపారు. రైతులు నాట్లు వేసే సమయంలోనే ప్రతి పంటకు రైతుబంధు ఇచ్చేవారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ప్రభుత్వం మాత్రం కేవలం ఓట్ల సమయంలో మాత్రమే రైతు భరోసా ఇస్తున్నదని తెలిపారు.

మోసం..కాంగ్రెస్ పార్టీ నైజం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటికీ నుంచి ఇప్పటివరకు నాలుగు పంటలు రాగా మొదటి పంట సమయంలో ఎంపీ ఎన్నికలు వచ్చాయన్నారు. ఓట్ల కోసం మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా రైతుభరోసా రూ.15వేలు కాకుండా కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన పాత రైతుబంధు పథకాన్ని రైతులకు అందించారని గుర్తు చేశారు. రెండో పంట సమయంలో ఎలాంటి ఎన్నికలూ లేవని, రైతుబంధు ఇవ్వకుండా ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూడోసారి కూడా ఎన్నికలు లేకపోవడంతో తూతూ మంత్రంగా కొంతమందికి మాత్రమే ఇచ్చి పెద్ద మొత్తంలో రైతులకు రైతుబంధు ఎగ్గొట్టారని తెలిపారు. ఇప్పుడు నాల్గోసారి పంట సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముందున్నాయని, ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టడానికి రైతుబంధు ఇస్తున్నారని పేర్కొన్నారు. మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజమని, దీనిని ప్రతిఒక్క రైతూ గమనిస్తున్నాడన్నారు. ఒకవేళ స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేకుంటే కచ్చితంగా ఈసారి కూడా రైతుబంధు ఎగ్గొట్టే వారన్నారు. రేవంత్‌రెడ్డి మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం ప్రభుత్వం ఏర్పడగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారని, చేయకపోగా ఎంపీ ఎన్నికల సమయంలో ఊరూరా తిరుగుతూ కనిపించిన ప్రతి దేవుడిపై ఒట్టు పెట్టుకుంటున్నారని తెలిపారు. ఎంపీ ఎన్నికలు పూర్తికాగానే కాలయాపన చేస్తూ చివరికి బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడికి తట్టుకోలేక సగం మందికి మాత్రమే రుణమాఫీ చేశారని తెలిపారు.

పోలీస్ ఇన్వెస్టింగ్ అధికారిగా మాట్లాడుతున్న పీసీసీ చీఫ్

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పోలీస్ ఇన్వెస్టింగ్ అధికారిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్‌ను జైలుకు పంపడమే లక్ష్యంగా మాట్లాడుతున్నాడని, ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టే కార్యక్రమాలు ఎక్కువ రోజులు సాగవని హెచ్చరించారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ట్యాపింగ్ కేసు విచారణలో ఉండగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. మహేశ్ కుమార్‌గౌడ్ పార్టీ అధ్యక్షుడు అని, ముఖ్యమంత్రి కాదన్నారు. జిల్లాకు మంత్రి పదవి రాకపోవడం అన్యాయమన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒక్కటే అని, అందుకే బీజేపీ ఎంపీలు ఉన్న చోట మంత్రి పదవులు ఇవ్వడం లేదన్నారు.

విత్తనాలకు రాయితీ ఇవ్వని ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు ఎకరాలున్న సగం మంది రైతులకు రైతుభరోసా ఎగ్గొట్టిందన్నారు. ఎగ్గొట్టిన రైతుభరోసా రూ.87, 500, రుణమాఫీ రూ.2 లక్షలు, వడ్ల బోనస్ మూడు సీజన్లకు కలిపి లక్షా 50వేలు అన్నీ కలిపి దాదాపు రూ. 4,37,500 బకాయి పడ్డారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా జీలుగ ధర రూ. 1,150 ఉండగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండింతలు (రూ. 2,140)పెంచారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రాయితీపై విత్తనాలు ఇచ్చిందని, ప్రస్తుతం ఏ విత్తనాన్ని కూడా రాయితీపై ఇవ్వడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు మూడు దఫాలుగా ఎగ్గొట్టిన వడ్లకు బోనస్, రైతు భరోసా, రుణమాఫీ బకాయిలు అన్నీ ఇచ్చాకనే, స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడగడానికి రావాలని, లేని పక్షంలో ప్రజలు తరిమికొడుతారని హెచ్చరించారు. ఓట్లు అడిగే నైతిక హక్కు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు.

దేశానికే అన్నం పెట్టే అక్షయపాత్ర కాళేశ్వరం

- నూరేండ్ల కష్టాలు తీర్చిన ప్రాజెక్టు
- కేసీఆర్ అపర భగీరథ యత్నానికి నిలువెత్తు నిదర్శనం
- బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, జూన్ 22 : తెలంగాణ జాతికి విశ్వఖ్యాతి తెచ్చిన కీర్తి కిరీటమైన కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే అన్నం పెట్టే అక్షయ పాత్ర అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జవన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఆరేండ్లుగా పారుతున్న నీళ్లతో అప్పటి వరకు నోళ్లు తెరిచిన భూములు పచ్చని పంటలతో విరాజిల్లుతూ రైతుల నూరేళ్ల కష్టాలు తీర్చాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల జరిగి ఆరేండ్ల యిన సందర్భంగా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ అపర భగీరథ యత్నానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్టత తెలియని వారే విషం కక్కుతున్నారని, కాంగ్రెస్, బీజేపీపై ఆయన మండిపడ్డారు. ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు నీరందుతున్నదని, కోట్లాది మందికి తాగునీరందిస్తున్నదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రపంచాన్నే అబ్బురపరిచిందని, కేసీఆర్ దీక్షా దక్షతను శత్రువులు సైతం కొనియాడారని తెలిపారు. కాళేశ్వరం ద్వారా కేసీఆర్ సాగునీటిని పారిస్తే, కాంగ్రెస్ విషం పారిస్తున్నదని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవినీతి అంటగట్టి కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి తెలంగాణ స్ఫూర్తి ప్రదాతను అవమానించిన కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కాళేశ్వరం ఆయకట్టు రైతులకు జీవన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నగర ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తా..

అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, జూన్ 22 : నగర ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తూ పోరాడుతానని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. మాధవ్‌నగర్ సమీపంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో పట్టణ పద్మశాలీ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగాహాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రతి పద్మశాలీ తర్పకు రూ. 5 లక్షల చొప్పున ఇచ్చామని, కల్యాణ మండపాలు, బడులకు నిధులు, శ్మశానవాటికలకు రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ. 8 కోట్లు సంఘాలకు అందజేసినట్లు వివరించారు. కార్యవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బిగాల గణేశ్ గుప్తాను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

శ్మశానమా.. పార్కింగ్ అడ్డానా!

అధ్వానంగా మారిన అర్సపల్లి వైకుంఠధామం

ప్రతి మనిషి ఆఖరి ప్రయాణం ప్రశాంతంగా ముగిసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించింది. ఇందులోభాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లి వైకుంఠధామంలో అన్ని రకాల సదుపాయాలను కల్పించింది. ఆహ్లాదం పంచేలా వివిధ రకాల పూల మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైకుంఠధామంపై నిర్లక్ష్యం వహిస్తున్నది. వైకుంఠధామంలో మున్సిపల్ వాటర్ ట్యాంకులు, ట్రాక్టర్లను నిలుపుతున్నారు. పార్కింగ్‌కు అడ్డాగా మార్చారు. మొక్కలకు నీళ్లు కూడా అందించకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. ఎక్కడపడితే అక్కడ చెత్తావెదారం పేరుకుపోవడంతో వైకుంఠధామం కళావిహీనంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఎస్సారెస్పీకి 2,049 క్యూసెక్కుల వరద

మోర్తాడ్, జూన్ 22: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఆదివారం 2,049 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1063.50 అడుగుల (14.229టీఎంసీలు)నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 599 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఇందులో 100 క్యూసెక్కులు కాకతీయ కాలువకు, 231 క్యూసెక్కులు మిషన్‌భగీరథకు విడుదల చేస్తుండగా, 268 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.

కందకుర్తి వద్ద గోదావరిలో వరద ప్రవాహం

కందకుర్తి వద్ద గోదావరి గల గల

రెంజల్, జూన్ 22: మండలంలోని కందకుర్తి వద్ద వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువ ప్రాంతం నుంచి వరద రాకతో గోదావరి జలకళ సంతరించుకున్నది. దీంతో పర్వదినాల్లో నదిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు తరలివచ్చే భక్తులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.